
# పబ్లిషర్‌గారొస్తున్నారు




"నిజం చెప్తున్నాను. జీడిపప్పు ఉస్మా పెట్టాడని కాదు. అతని కథలు ఇప్పుడు అనేక పత్రికల్లో వస్తోన్న అనేక కథలకంటే ఎంతో బావున్నయ్."

నెలరోజులపాటు ఈ కథలను వివిధ పత్రికలకూ పంపటం, అవి తిరిగి రావటంలాంటి ప్రక్రియలు జరిగాయ్. ఆ తరువాత అసలు తిరిగి రావడం మానేశాయి.

తరువాత కొద్దిరోజులకు ఓ కథ ఓ వారపత్రికలో పడిందంటూ ఆ పత్రిక కాపీలు ఓ వంద తెచ్చి కాలనీలో అందరికీ తలోటీ పంచసాగాడు చంద్రకాంత్.

"ఇన్ని కాపీలెందుక్కొన్నావ్? రెండు కాపీలు కొంటే కాలనీ వాళ్ళందరం ఒకరి తర్వాత ఒకరు చదువుకునేవాళ్ళంకదా?" అన్నాడు రంగారెడ్డి జాలిగా.

"అబ్బే– ఇవి కొన్నవికావు గురూజీ! ఈ పత్రికవాళ్ళు కథకు పారితోషిక ఇవ్వరు. ఆ ఆ సంచిక తాలూకూ వంద కాపీలు ఫ్రీగా ఇస్తారు. వాటిని మనమే ఎక్కడయినా అమ్ముకుని డబ్బు చేసుకోవాలన్నమాట! దచయేసి అందరూ ఇప్పుడు తలో మూడురూపాయలు ఇవ్వండి" అన్నాడు చంద్రకాంత్.

మాకతనిని చూస్తే జాలివేసింది.

ప్రతిఫలం బదులు ఆ పత్రిక కాపీలు ఇచ్చి వాళ్ళు మాకందరికీ తలో రెండ్రూపాయలు

ఫైన్ వేస్తున్నట్లనిపించింది.

"అలాంటి చెత్త పత్రికలకు కథలు పంపకు! పెద్ద పత్రికలయితే ప్రతిఫలం కరెక్ట్‌గా ఇస్తారు–" అన్నాడు రంగారెడ్డి.

"కానీ పెద్ద పత్రికలు రికమండేషన్ లేనిదే కథలు వేసుకోరుకదా?" అన్నాడు చంద్రకాంత్ విచారంగా.

"తెలుగురాత" వారపత్రిక ఎడిటర్‌తో నాకు పరిచయముంది. అతని దగ్గరకు వెళ్దాం సాయంత్రం" అన్నాడు గోపాల్రావ్.

"మరా సంగతి ఎప్పుడూ చెప్పలేదే బాస్! అనవసరంగా కథలన్నీ అలా ఉండి పోయాయ్–"

"మొన్నేగా అతనికీ నాకూ పరిచయమయింది!"

"ఎలా పరిచయమయింది?"

"లకడీకాపూల్ ట్రాఫిక్ జామ్‌లో ఇద్దరి స్కూటర్లూ పక్క పక్కనే రెండు గంటలు నిలబడ్డాయ్ కదా! అప్పుడు పరిచయమయింది"

"ఏడ్చినట్లుంది. ట్రాఫిక్ జామ్ పరిచయాలు రికమండేషన్ చేసేంత గట్టిగా ఉంటాయా?" అడిగాడు రంగారెడ్డి.

ఆ మాట వింటూనే శాయిరామ్ ఠక్కున అందుకున్నాడు.

"అలా అనకు గురూ! మన కాలనీ సంధ్యారాణి లవ్ మారేజ్ ట్రాఫిక్ జామ్‌లోనే కదా జరిగింది? అప్పుడే మర్చిపోయావా"

అందరికీ వెంటనే ఈ విషయం గుర్తుకొచ్చేసింది. వెంటనే అందరం కలసి తెలుగురాత వార పత్రిక ఎడిటర్ని కలుసుకోటానికి బయల్దేరాము. గోపాల్రావ్ పేరు చెప్పగానే లోపలకు ఆహ్వానం వచ్చింది.

"హలో గోపాల్రావ్‌గారూ! ఏమిటి విశేషాలు? మళ్ళీ ఫ్రెష్‌గా ఎక్కడయినా ట్రాఫిక్ జామ్‌లోకెళ్ళారా?" అడిగాడాయన అప్యాయంగా.

గోపాల్రావ్ గర్వంగా మావేపు చూసి కాలర్ ఎగరవేశాడు.

"అంత పెద్ద ట్రాఫిక్ జామ్స్ జోలికి వెళ్ళటం లేదండీ ఈ మధ్య. చిన్న చిన్న వాటినే ఎన్నుకుంటున్నాను. చిన్నవయితే పోలీసులుండరు కాబట్టి త్వరగా క్లియరయిపోతాయ్"

"ఇంతకూ మీరొచ్చిన పనేమిటి?" గోపాల్రావ్‌ని అడిగాడతను.

"మరేంలేదు. మా కాలనీ రైటర్ చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ గురించి మీకు తెలిసే ఉంటుంది. చాలా ఫేమస్ రైటర్–"

"అతని పేరు నేనెప్పుడూ విన్న గుర్తులేదే" అన్నాడతను ఆలోచిస్తూ.

"వినుండక పోవచ్చులెండి! ఎందుకంటే అతను మా కాలనీలోనే చాలా ఫేమస్ రచయిత. బయట కాదు"

"అదీ సంగతి! అలా చెప్పండి..."

"ఇప్పుడతను ఏ– ఒన్ రచయిత అవాలని కంకణం కట్టుకున్నాడు–"

"కంకణం బంగారందేనా?" అడిగాడు ఎడిటరు.

"అవునండీ ప్యూర్ గోల్డ్ వాళ్ళ ముత్తాతలది–"

"అయితే ఇంకేం! అందులో సగం నాకిమ్మనండి! వచ్చేవారం నుంచీ అతని నవల స్టార్ట్ చేసేద్దాం–"

చంద్రకాంత్ స్పృహ తప్పబోయి అతి కష్టంమీద ఆగాడు.

"ఆ, నవలా?"

"అవను–"

"మరి నేనింతవరకూ నవల రాయలేదు కదా?"

"రచయితలు కాని వాళ్ళను రచయితలను చేయటమే మా పత్రిక గొప్పతనం."

"నిజమేననుకోండి! అయినా నవల రాయలేదు కదా?"

"కథ నేన్చెప్తానయ్యా! వారం వారం నువ్ రాసివ్వటమే–"

"ఆ? నిజంగానా సార్! అయితే బంగారు కంకణంలో సగం మీకు తప్పక ఇచ్చేస్తాన్సార్!"

"అక్కడితో అవలేదు. ఆ నవలమీద నీకొచ్చే డబ్బులో మూడొంతులు నాది, ఒకవంతు నీది."

"అదేమిటి సార్? ఫిఫ్టీ ఫిఫ్టీ అని విన్నానే–"

"అది సంవత్సరం క్రితం సంగతి– ఇప్పుడు ధరలు పెరగలా? అంచేత సెవెంట్రీఫైవ్– ట్వంటీఫైవ్–"

"అలాగేనండీ–"

"అయితే రేపు మధ్యాహ్నం వచ్చెయ్. హొటల్ చిమోక్‌లో లంచ్ కొడుతూ మొదటి రెండు వారాలకూ ప్లాట్ చెప్తాను. అన్నట్లు లంచ్‌బిల్ నువ్వే ఇవ్వాలి."

"అదేంటండీ– అదికూడా సెవెంటీఫైవ్, ట్వంటీఫైవ్ కాదాండీ–"

"కాదు–"

"ఫోనీ ప్లాటంతా రేపే చెప్పేస్తే మళ్ళీ మళ్ళీ చిమోకా' బిల్ ఇచ్చే బర్డెన్ తగ్గిపోతుంది కదండీ నాకు–"

"అమ్మా! ఆశేపాపం! ఒక ప్రముఖ రచయిత– పేరెందుకులే– ఇలాగే మొత్తం

ప్లాటంతా ఒక సిటింగ్‌లో చెప్పించుకుని ఆ నవల టైటిల్‌తో సహా వేరే పత్రికలో రాసేశాడు. దగుల్బాజీ–"

"కానీ నేనలాంటి వాడిని కాదండీ–"

"అవునండీ! వీడలాంటివాడు కాదు! చాలా జెంటిల్మెన్" తనూ సర్టిఫై చేశాడు శాయిరామ్.

"రచయితల్లో జెంటిల్మెన్ ఉంటారంటే నేన్నమ్మను" దృఢంగా అన్నాడతను.

"వీడు మాత్రం ఎంచేతో జెంటిల్మెనేనండీ? నేను గారంటీ ఇస్తాను" అన్నాడు గోపాల్రావ్.

ఎడిటర్‌గారు కాసేపు ఆలోచించారు.

"ఆల్‌రైట్! మీరంతా అంతగా చెప్తున్నారు కనుక ఓకే! ఆరువారాలా వరకూ కథ చెప్తాను"

"బాబ్బాలు– ఎనిమిది వారాలు చేసుకోండి– వాడు ఆర్థికంగా కొంచెం వీక్‌గా ఉన్నాడు."

"కుదరదయ్యా! తరువాత ఏం జరుగుతుందో నాకు మాత్రం ఎలా తెలుస్తుంది."

"పోనీ ఆ ఒరిజినల్ నవలేంటో చెప్పండి. మా వాడు కొని చదువుతాడు"

"ఇంకా అది రిలీజ్ కాలేదయ్యా! అమెరికాలో రెండు నెలల క్రితమే ఓ రచయిత రాయటం మొదలు పెట్టాడు. ఏ రోజు రాసిన మేటర్ ఆరోజు మా డెయిలీ ప్రింటర్ ద్వారా ఆ రచయిత స్టెనో గ్రాఫర్ మాకు రహస్యంగా పంపిస్తూంటాడు. ఈ సంగతెవరికీ చెప్పకండి మళ్ళీ– చెప్పాను కదా! రచయితలంతా దగుల్బాజీలు– ఒకసారేం జరిగిందో తెలుసా? ఒక రచయిత పేరెందుకులెండి– నేను ఫ్రాన్స్ నుంచి ఇంపోర్టు చేసుకున్న నవల టైటిల్ కాపీ కొట్టేశాడు."

"చాలా దారుణమండీ–"

"దారుణంన్నర! అందుకే వాళ్ళంటే నాకు మంట! అందుకే మా పిల్లలను స్కూల్‌కి తీసుకెళ్ళే మా రిక్షావాడితో రాయిస్తున్నాను నెక్స్ట్ సీరియల్! మీకు తెలుసో తెలీదో రిక్షా వాళ్ళు చాలా విశ్వాసంగా ఉంటారు– రచయితకన్నా–"

"అవునండీ–"

"ఇంతకూ ఇప్పుడు మీ రచయితకు రిక్షా తొక్కడం వచ్చా?"

"రాదండీ–"

"అయితే నేర్చుకోమను! రిక్షా వారంరోజులు తొక్కితేచాలు. విశ్వాసం అలవడుతుంది."

"అఖ్ఖరలేదండీ! వీడు స్వతహాగానే జెంటిల్మెన్ – వాళ్ళ ఫామిలీలో చెడబుట్టాడని

వాళ్ళ ఫాదర్ ఇప్పటికీ తిడుతుంటాడు–”

“అలాగా...”

“అవునండీ! వీళ్ళ ఫాదర్ పరమరోగ్– మీకు తెలుసో తెలీదో! మా కాలనీ గవర్నమెంట్ క్వార్టర్స్ అని అందరికీ తెలిసినా పదకొండు మందిని మోసం చేసి అమ్మేశాడు ఇంతవరకూ–”

“దగుల్బాజీ! ఏం చేస్తూంటాడతను?”

“ఎడిటరండీ!”

“సరే మీరు వెళ్ళండి! రేపు మధ్యాహ్నం హొటల్ ‘చిమోకా’ లో ఎదురు చూస్తూంటాను. సరేనా?”

“సరేనండీ..”

అందరం బయటికొచ్చేశాం.

“గురూ! ఈ హొటల్ బిల్లులు ఇవ్వటం నా వల్లకాదు గురూ! నేను రచయిత అవకపోయినా ఫర్వాలేదు–”

అందరికీ అతనిమీద జాలివేసింది.

“పోనీ మన కాలనీ ఫండ్స్ ఉన్నాయి కదా! అందులో నుంచి అయిదువేలు వీడికిచ్చేద్దాం” అన్నాడు జనార్ధన్.

అందరం చకచక ఆలోచించాం.

“పోనీలే ఇచ్చేద్దాం” అన్నాడు రంగారెడ్డి, శాయిరామ్, గోపాల్రావ్ యాదగిరి కూడా వప్పుకున్నారు. “సాంస్కృతిక కార్యకలాపాలకు ఖర్చు చేశామంటే ఎవ్వరూ కాదనరు” అన్నాడు గోపాల్రావ్.

“కాపోతే నాకూ ఓ పాతికవేలు ఇవ్వాల్సి ఉంటుంది” అన్నాడు జనార్ధన్.

“అదేంటి? నీకెందుకు?”

“నేను హీరోగా ఓ టీవీ ప్రోగ్రామ్ తీసి మన దూరదర్శన్ ద్వారా టెలికాస్ట్ చేయిస్తాను. అదికూడా సాంస్కృతిక కార్యకలాపమే కదా–”

దాంతో ఆటోమేటిగ్గా చంద్రకాంత్‌కి డబ్బిచ్చే ప్రపోజల్ రద్దయిపోయింది.

“ఇగో చంద్రకాంత్ భాయ్! ఆంధ్రఖ్యాతి వారపత్రిక లేదా? అందులో మా చిన్నమ్మ కొడుకు వాచ్‌మెన్‌గా చేస్తుండు. అడి రికమండేషన్ నడుస్తదేమో అడుగుదాం– పదండ్రి” అన్నాడు యాదగిరి.

అందరం మళ్ళీ స్కూటర్ల మీద ఆంధ్రఖ్యాతి వార పత్రికాఫీస్ చేరుకున్నాం.

యాదగిరి చిన్నమ్మ కొడుకు శ్రీనివాస్ గేటు దగ్గరే కనిపించాడు. మా సంగతంతా

విన్నాక శ్రీనివాస్ కాసేపు ఆలోచించాడు.

"ఇగో– ఒకపని చేయండి! మా ఎడిటర్ సాబ్ వాళ్ళ పోరడికి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఇన్‌స్పెక్టర్ ఇంటర్‌వ్యూ వచ్చింది. ఆ డిపార్ట్‌మెంట్‌ల కోషిష్‌జేసి ఆ పోరడికి మీరుద్యోగం ఇప్పిస్తే మీ నవలలు, కతలు అన్నీ పబ్లిష్ జేస్తడు–"

అందరం మొఖమొఖాలు చూసుకున్నాం.

"ఆ గుర్తుకొచ్చింది. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఒక ఎస్పీగారు నాకు తెలుసు?" అన్నాడు రంగారెడ్డి.

అందరం రంగారెడ్డి వేపు ఆశ్చర్యంగా చూశాం.

"ఆ విషయం మరి మనల్ని పోలీసు అరెస్ట్‌చేసి లాకప్‌లో పడేసినప్పుడు చెప్పలేదేం?" కోపంగా అడిగాడు శాయిరామ్.

"ఎలా చెప్తాను. మనల్ని అరెస్ట్ చేయించిందసలు ఆయనేకదా" నసిగాడు రంగారెడ్డి.

"ఏడ్చినట్లుంది" అన్నాడు గోపాల్రావ్.

అందరం నిరాశగా కూలబడ్డాం. మరో రెండు పత్రికలు చుట్టుముట్టాక చంద్రకాంత్ నవల సీరియల్‌గా రావటం అసాధ్యమని మాకర్థమయిపోయింది.

అందరం ఆ రోజు కూర్చుని చంద్రకాంత్‌ని ఓదారుస్తూంటే చంద్రకాంత్ కోపంగా, విచారంగా, పచార్లు చేయసాగాడు.

"అయితే నేను నవలా రచయితగా కావటం కుదరదన్నమాట" అన్నాడతను ఆవేశంగా.

"ఇంచుమించుగా కుదరనట్లే" వప్పుకున్నాడు శాయిరామ్.

చంద్రకాంత్‌కి కోపం ఆగలేదు. "నా ప్రతిభ తెలుగువాళ్ళు గుర్తించరన్నమాట! హు! తెలుగువాళ్ళు! ఆల్ రైట్. సరే! అయితే నేను టీవీకి రాస్తాను. మీ అందరిమీదా నా పగ తీర్చుకుంటాను" అన్నాడు ఉగ్రుడవుతూ.

ఆ మాట వింటూనే ఉలిక్కిపడ్డాం.

మా కాలనీ ప్రశాంతతకు పెట్టింది పేరు. గూండాలు చేసే వినాయక చవితి లాంటి పండుగలు, ఇరత కొట్లాటలు మా కాలనీలో లేవు. అదొక్కటే మా అందరికీ ఆనందకర మయిన విషయం. అలాంటిది ఇప్పుడు చంద్రకాంత్ టీవీకి రాయటం మొదలుపెడితే ఎలాంటి కొట్లాటలు జరుగుతాయో, ఎలా అనేకమంది రాజధాని వాసులు మా కాలనీ మీదకు దండెత్తుతారో మాకు క్షుణ్ణంగా తెలుసు. ఎందుకో పరమ భయంకరంగా నటిస్తున్న ఒక టీవీ హీరో ఇంటికి మా ఆఫీసు వాళ్ళందరం వెళ్ళి వాడిని చావగొట్టి ఇల్లంతా ధ్వంసం చేసివచ్చాం ఓసారి.

"బ్బాబ్బాబు! అంతపని చేయకు. ఎలాగోలా నువ్ నవలారచయిత అయ్యేట్లు మేము

చూస్తాం కదా!" అంటూ సర్దిచెప్పాడు రంగారెడ్డి.

"ఎప్పటికి జరిగేనా పని?" అనుమానంగా అడిగాడు.

"మాకు రెండు రోజులు టైమివ్వు. మా బ్రెయిన్ ఉపయోగించి ఏదొక ఉపాయం కనుక్కుంటాం."

"సరే! రెండ్రోజులు దాటిందంటే మాత్రం మర్యాదగా ఉండదు గుర్తుంచుకోండి. ఆ తరువాత టీవీకి రాస్తాను- అందులో హీరో వేషం కూడా వేసేస్తా." అనేసి బెదిరించి వెళ్ళిపోయాడతను.

అతను వెళ్ళగానే మేము మామూలుగా ఆ విషయం మర్చిపోయి రెండ్రోజులు హాపీగా గడిపేశాం. ఆరోజు బాగా పొద్దుపోయాక యాదగిరి గట్టిగా కేకలు పెడుతూ ఇంట్లోనుంచి కాలనీ మధ్యనున్న వేదిక దగ్గరకు పరుగుతో వచ్చాడు. అతని కెప్పుడయినా అద్భుతమయిన ఆలోచనలు వచ్చినప్పుడు అలా కేకలుపెడతూ పరుగెత్తుకు వస్తాడని మాకు తెలుసు గనుక అందరం అతని చుట్టూ మూగాం.

"మన చంద్రకాంత్ తంబి నవల మాగజైన్ల వేయకున్నగాని నడుస్తది!" అన్నాడతను ఎగ్జయిట్‌మెంట్‌తో.

"మరెలా నవలా రచయితవుతాడు?" అడిగాడు శాయిరామ్ ఆశ్చర్యంగా.

"పబ్లిషర్ తానకుపోయి మనమే పబ్లిష్ చేయిద్దాం. పేరుకు పేరూ వస్తది- పైసల్‌కి పైసల్ వస్తయి- ఎట్లున్నది మన అయిడియా?"

"వండర్‌ఫుల్ అయిడియా" అన్నాడు చంద్రకాంత్ సంతోషంతో.

మిగతా వాళ్ళందరం కూడా ఆ ఉపాయం చాలా బాగుందని యాదగిరిని అభినందించాం.

"అయితే మనం వెంటనే విజయవాడ వెళ్ళాలి-" అన్నాడు చంద్రకాంత్ ఉత్సాహంగా. ఆ మాటతో అందరం అదిరిపడ్డాం.

"విజయవాడెందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

"ఎందుకేమిటి?" పబ్లిషర్లంతా అక్కడే ఉంటాడు. కొంచెం స్టఫ్ ఉన్న నాలాంటి రచయిత ఎవరయినా కనబడితే చాలు! మాకివ్వమంటే మా కివ్వమని కలబడి నవల ప్రతిని లాక్కుపోతారట-"

"అయితే నువ్వే వెళ్ళిరా మేమంతా ఎందుకు?" అన్నాడు శాయిరామ్ అయిష్టంగా.

"మీరు లేకపోతే ఎలా? నవల పబ్లిషింగ్ అంటే మాటలా? వేలకి వేలు బిజినెస్! నన్నెవరయినా ఎక్స్‌ప్లాయిట్ చేస్తారేమోనని భయంగా ఉంది. ఈ పబ్లిషర్స్‌ని నమ్మటానికి వీల్లేదనీ, వాళ్ళు తెగ మోసం చేస్తారనీ మా ఫ్రెండ్ వంచకరావ్ చెప్పాడు"

"అతనికేం మోసం చేసారుట?" కుతూహలంగా అడిగాడు రంగారెడ్డి.

"వాడి నవల పబ్లిష్ చేస్తానని మాటిచ్చి తరువాత దేశం వదిలి పారిపోయాడట!"

"ఇంతకూ విజయవాడ వెళ్లానికి ఇంతమందికి డబ్బెక్కడుంది?" అడిగాడు గోపాల్రావ్.

"దాన్దేముంది గురూ. మన కాలనీ కల్చురల్ ఫండ్స్ ఉన్నాయ్ కదా! ఇదీ కల్చురల్ యాక్టివిటీయే కాబట్టి అందులో నుంచి కొంతమొత్తం..." అంటూ నడిగాడతను.

ఇక తప్పేట్లు లేదని అందరం ఓ మూలకెళ్ళి చర్చించుకుని చివరకు చంద్రకాంత్ కోరిక తీర్చటానికే నిర్ణయించుకున్నాం.

మర్నాడు ఉదయానికల్లా అందరం విజయవాడ చేరుకున్నాం. హొటల్లో దిగి, స్నానం వగైరాలు ముగించుకుని పబ్లిషర్స్ వేటకు బయలుదేరాం. ముందస్తుగా మేము దిగిన హొటల్లోనే ఉన్న ఓ పుస్తకాలషాపు ఓనర్ని సంప్రదించాడు శాయిరామ్. అతనిచ్చిన వివరాలను బట్టి తేలిందేమిటంటే జగజ్జననీ పబ్లికేషన్స్ చాలా పేరున్న ప్రచురణ సంస్థ అని. వెంటనే ఆ అడ్రస్‌కి చేరుకున్నాం. అప్పటికే ఆ సంస్థముందు అరకిలో మీటరు పొడుగు 'క్యూ' ఉంది.

"చూశారా! ఈ సంస్థ ప్రచురించిన పుస్తకాల కోసం పాఠకులు ఎలా 'క్యూ' గట్టి కొంటున్నారో–" గర్వంగా చూపించాడు శాయిరామ్.

"ఇలాంటి పెద్ద పబ్లిషర్‌కే ఇచ్చేద్దాం! పాపం! ఇలాంటి వాళ్ళకు నా నవల్లాంటి మంచి క్వాలిటీ నవలలు ఇచ్చి ప్రొత్సాహపరచటం నాలాంటి రచయితల ధర్మం" అన్నాడు చంద్రకాంత్ జాలిగా.

"అవును– ఇచ్చేద్ధాం" అన్నాడు రంగారెడ్డి కూడా.

అందరం ఆ క్యూని తప్పించుకుని ముందున్న పుస్తకాలషాపు దాటి వెనుక వేపున్న పెద్ద ఏసీ గదిలోకి అడుగుపెట్టాం. రివ్వాలింగ్ ఛైర్‌లో కూర్చున్న లావుపాటి వ్యక్తి మ్మల్ని చూడగానే గౌరవంగా లేచి నిలబడ్డాడు.

"రండి! కూర్చోండి! ఒరేయ్ రాజూ! అరడజను కూల్‌డ్రింక్స్ చెప్పు"

అతని ట్రీట్‌మెంట్‌కి మాకు ఎక్కడలేని ఆనందం కలిగింది. అందరం కుర్చీల్లో కూర్చున్నాం.

"చెప్పండి సార్? ఏం పుస్తకాలు కొంటానికొచ్చారు?" ఆదరంగా అడిగాడతను.

"పుస్తకాలు కొంటానికి కాదండీ! నవలలివ్వటానికి వచ్చాము–" అన్నాడు శాయిరామ్.

అతని ముఖంలో హఠాత్తుగా మార్పువచ్చింది. అదివరకటి ఆదరణ, మృదుత్వం మాయమైనాయ్.

"నవలలా? ఏం నవలలూ?"

"ఇదిగో – ఇతను మా కాలనీ రైటర్ చంద్రకాంతండీ! మూడు నవలలు రాశాడు. ఇంకా పద్దెనిమిది నవలలకు ప్లాట్స్ ఉన్నాయ్ రడీగా!" ఆనందంగా చంద్రకాంత్ వేపు చూపించాడు రంగారెడ్డి.

"ఇప్పుడు పంథొమ్మిదిటికి ప్లాట్స్ రడీగా ఉన్నాయ్– మా వాడు తప్పు చెప్పాడు" అన్నాడు చంద్రకాంత్.

"అయితే ఇక్కడి కెందుకొచ్చారు?" కోపంగా అడిగాడతను. మాకు ఆశ్చర్యం కలిగింది.

"ఎందుకేమిటండీ? మాట్లాడ్దాని కొచ్చాము. మీకే ఆ నవలలు వేసే అవకాశం ఇవ్వాలని మా అభిప్రాయం–"

అతను కుర్చీలో నుంచి లేచి నిలబడ్డాడు.

"గెటౌట్" అన్నాడు కోపంగా.

"మమ్మల్నా మీరనేది!"

"అవును! బయటికెళ్ళి షాప్ముందున్న 'క్యూ'లో నిలబడండి"

"అదేమిటండీ పాఠకుల 'క్యూ' లో మేమెందుకు నిలబడతాం?" అడిగాడు శాయిరామ్ కోపంగా.

"అది పాఠకుల 'క్యూ' కాదయ్యా! రచయితల 'క్యూ'! వాళ్ళందరూ నవలలు వేసుకోమని బ్రతిమాలాడానికే వచ్చారు. వెళ్ళండెళ్ళండి! ఒరే రాజూ! ఆ కూల్‌డ్రింక్స్ కాన్సిల్‌చెయ్–" మాకు తలకొట్టేసినట్లయింది.

రచయితలను అతనలా హీనంగా చూడటం మాకు నచ్చలేదు. సరిగ్గా అప్పుడే 'క్యూ' లో ఉన్న ఓ వ్యక్తి లోపలికొచ్చాడు. అతని చేతిలోని వ్రాత ప్రతిని వినయంగా పబ్లిషర్ ముందుంచాడు.

"సబ్జెక్ట్ ఏమిటో రెండు ముక్కల్లో చెప్పు" చిరాగ్గా అన్నాడు పబ్లిషర్.

"ఇది సోషియో డిటెక్టివ్ నవలండీ ఇందులో హీరోయిన్‌కి ఓ జబ్బు ఉంటుందండీ– అదేమిటంటే అస్సలు నిద్రపట్టదండీ ఆమెకు. హీరో దాని విషయం పరిశోధించుకుంటూ వెళ్తే చివరకు ఓ మర్డర్ కేసులో ఇరుక్కుపోతాడండీ. అక్కడినుంచీ హత్యలూ, శవాలూ, పోలీసులూ–"

"సరే రెండొందిలిస్తాను–"

రచయిత ఆనందంగా చూశాడు.

"సరే– అలాగే ఇవ్వండి–"

పబ్లిషర్ రెండొందలిచ్చి ఓ కాగితం మీద సంతకం పెట్టించుకున్నాడు. మేమింక భరించలేక బయటికొచ్చేశాం.

"మరీ ఇంత దారుణంగా ఉందా రచయితల పరిస్థితి! హు!" అన్నాడు శాయిరామ్.

"కానీ మరి యండమూరి వీరేంద్రనాథ్ ఇంటికెళ్ళినప్పుడు చాలా మంది పబ్లిషర్లు 'క్యూ' కట్టి నిలబడి ఉండటం చూశానే" విచారంగా అన్నాడు చంద్రకాంత్.

అందరం ఆ రోడ్ మీదే ఉన్న ఎనిమిది కొండలు పబ్లికేషన్స్ ఆఫీస్‌లోకి నడిచాం. లోపల ఓ యువకుడు కూర్చుని ఉన్నాడు.

"ఏం కావాల్సార్?" అడిగాడు వినయంగా.

సంగతంతా చెప్పాడు శాయిరామ్.

"ఓ! తప్పకుండా పబ్లిష్ చేద్దాం సార్. మొత్తం ఇరవై రెండు నవలలూ నేనే పబ్లిష్ చేస్తాన్సార్!" అన్నాడతను.

చంద్రకాంత్ ఆనందంతో పొంగిపోయాడు.

"థాంక్యూ- థాంక్యూ వెరీమచ్! వాటన్నిటినీ పాఠకులు 'క్యూ' కట్టి కొనుక్కుంటారని నాకు నమ్మకం ఉంది-" అన్నాడు గర్వంగా.

"అబ్బే- అలా ఎవరూ కొనరులెండి! బలవంతంగా అంటగట్టేయటమే."

"అంటే?"

అంటే ఏముందండీ! మా చిన్నాన్న కొడుకు సబిన్‌స్పెక్టర్ కదండీ! చిన్న చిన్న దొంగతనాలు చేసినవాళ్ళనూ ట్రాఫిక్ రూల్స్ పాటించనివాళ్ళనూ, పోట్లాటలు దొమ్మీ కేసులు, ఇలా ఎంతోమందిని స్టేషన్‌కి లాక్కొసార్లు కదండీ! వాళ్ళందరితో పాతిక్కాపీలు చొప్పున మా నవలలు కొనిపిస్తారండీ! అలాగే సేల్స్‌టాక్స్‌లో మా బామ్మర్ది పనిచేస్తున్నాడు. మా నవవలల సెట్ రిలీజయవగానే అన్ని షాపులమీద రైడింగ్ చేసి వెయ్యి కాపీలు కొనిపిస్తాడు. ఇంకా మా ఫ్రెండ్ ఒకతనున్నాడు. అతనో వెయ్యి కాపీలమ్మేస్తాడు-"

"అతనేం చేస్తూంటాడు?" అడిగాడు రంగారెడ్డి కుతూహలంగా.

"గవర్నమెంట్ హాస్పిటల్లో డాక్టర్. ఆపరేషన్ రోజున ఎంత చెత్త నవలయినాసరే అయిదువేల కాపీలు అమ్మేస్తాడు- పేషెంట్స్‌కి."

"అయితే సరే! మరి రాయల్టీ విషయం చెప్తారా?" అడిగాడు శాయీరామ్.

"ఇందులో చెప్పేదేముందండీ! పదిశాతం! ఫిక్స్‌డ్ రేటే అది."

అందరం ఆశ్చర్యపోయాం.

ఒక్కొక్క పుస్తకానికి పదిశాతం చొప్పున రాయల్టీ లభిస్తే ఇరవై పుస్తకాలకూ చంద్రకాంత్‌కి సుమారు యాభయ్‌వేల రూపాయలు వస్తాయనే సరికి మాకు చంద్రకాంత్ మీద కొంచెం ఈర్ష్య కూడా కలిగింది.

"సరే- మరి కాంట్రాక్ట్ మీద సంతకాలు పెడదామా? అడిగాడు చంద్రకాంత్

"ఎడ్వాన్స్ ఇస్తే పెట్టేద్దాం" అన్నాడతను.

మాకు అతని మాటలు అర్థం కాలేదు.

"అడ్వాన్స్ ఇస్తానంటారా? ఇవ్వండి– మాకేం అభ్యంతరం లేదు" అన్నాడు రంగారెడ్డి.

"అలా జోక్‌లేయకండిసార్! అడ్వాన్స్ నేనివ్వటమేమిటి?"

"అంటే?" అనుమానంగా అడిగాడు శాయిరామ్.

"ఓ పదివేలయినా ఎడ్వాన్స్ కొట్టండి–"

"మేమియ్యాలా??" నమ్మలేనట్లు అడిగాడు చంద్రకాంత్.

"అవునూ! కొత్తగా అడుగుతున్నారేమిటి? మా సంస్థలో బిజినెస్ ఎప్పుడూ ఇలాగే ఉంటుంది"

"అదేమిటండీ! రచయితే ఎదురు డబ్బివ్వటమేమిటి? పత్రికల్లోనేగా ఇలాంటి పద్ధతి ఉన్నది"

"ఇదిగో! చూడండి! మీకిష్టమయితే డబ్బు కట్టండి– లేపోతే లేదు. అంతేకానీ ఊరికే నస పెట్టకండి– మాకు ఫిఫ్టీన్ పర్సెంటిచ్చి నవలలు పబ్లిష్ చేయించుకునే వాళ్ళున్నారు–"

మేమ మాట్లాడకుండా బయటికొచ్చాం.

అందరూ దిగాలుపడి ఏలూర్ రోడ్‌మీద నడుస్తోంటే 'హలో గోపాల్రావ్' అన్న కేక వినిపించింది. మరుక్షణం అవతలి వేపు ఫుట్‌పాత్ మీద నుంచీ ఒక్క గెంతుగెంతి మాదగ్గర కొచ్చాడు మీసాల్రావ్. అతనిని చూస్తూనే గుర్తుపట్టేశాము. అతనో ప్రముఖ రచయిత.

"ఏమిటి గురూ సంగతి? ఎప్పుడొచ్చావ్ విజయవాడకి" అడిగాడతను అప్యాయంగా. ఇద్దరూ అయిదు నిమిషాల సేపు సంభాషణల్లో మునిగిపోయారు.

"ఇప్పుడో సమస్య వచ్చింది గురూ! మా కాలనీలో రచయిత ఒకడు తన రచనలు ప్రజల మీదకు వదిలే అవకాశాలు దొరక్క చాలా ఇబ్బంది పడిపోతున్నాడు. ఇటు పబ్లిషర్ లేమో వద్దు పొమ్మంటున్నారు–" అతనితో చెప్పాడు గోపాల్రావ్.

అతను పగలబడి నవ్వాడు.

"పిచ్చివాళ్ళల్లారా! రచయిత ఎప్పుడూ డైరెక్ట్‌గా పబ్లిషర్ దగ్గర కొచ్చేకూడదు– ముందు మనని మనం పాప్యులర్ చేసుకోవాలి!"

"పాప్యులర్ ఎలా చేసుకోవటం?" ఆశగా అడిగాడు చంద్రకాంత్.

"నేను అవలంభించిన పద్ధతి ఫాలో అవటమే–"

"అంటే మీరేం చేశారు?"

"ఒక దినపత్రిక ఎడిటర్‌కి అయిదువేలు లంచం కొట్టాను. అంతే! అంతే! డెయిలీ సీరియల్ స్టార్టయిపోయింది. ఆ సీరియల్ అద్భుతంగా ఉందని నేనే దొంగ పేర్లతో

పుత్తరాలు రాసి అయిదారు ఊళ్ళనుంచి పోస్ట్ చేశాను. ఆ తరువాత ఆ సీరియల్ వల్ల మోడువారిన తమ జీవితాలు చిగురించాయని కొంతమందితోనూ, కేవలం నా సీరియల్ వల్లే తమ సంసారాలు కుదుటపడ్డాయని మరికొంతమంది స్త్రీల పేర్లతోనూ ఫోటో వుత్తరాలు రాయించాను. ఆ తరువాత ఈ యుగంలోని ఏకైక మేటి రచయిత అన్న బిరుదు ఆ ఎడిటర్‌కి మరో రెండువేలు లంచం కొట్టి వేయించాను. ఆ సీరియల్ వల్ల ఆ డెయిలీ సర్క్యులేషన్ రెట్టింపు అయినట్లు కరపత్రాలు ప్రచురించి అన్ని రోడ్లు మీద పంచిపెట్టాను. అంతే! అక్కడి నుంచి పబ్లిషర్స్ రావటం ప్రారంభమయింది. వారం రోజుల్లో ఇంటిముందు క్యూ– ఒకరికి తేలీకుండా ఒకరికి బేరం పెట్టేశాను. పబ్లిషర్స్ ఇస్తానన్నది రెండువేలే. అయినా అరవై వేలకు అమ్ముడయినట్లు మిగతావారందిరికీ చెప్పేశాను. ఒప్పందం మేరకు ఆ పబ్లిషర్ కూడా అదే అబద్ధం బెజవాడంతా ప్రచారం చేసేశాడు. నవల పబ్లిషయాక స్కీమ్ నెంబర్– 2 స్టార్ట్ చేయాలి–"

"స్కీమ్ నెంబర్– 2 అంటే ఏమిటి?" అడిగాడు రంగారెడ్డి.

"పబ్లిసిటీ! ప్రచురించకముందే పదివేల కాపీలు అమ్ముడయి రికార్డు స్థాపించిన ప్రప్రథమ భారతీయ నవల" అని వేసేయాలి అన్ని పత్రికల్లోనూ. మన ఫోటోని మనమే డబ్బు ఖర్చుపెట్టి అన్ని పత్రికల్లోనూ ప్రకటన రూపంలో గుప్పించేయాలి. అంతే! అక్కడితో డిమాండ్ పెరిగిపోతుంది. "నవలకు పదివేలిస్తాం" అంటూ వస్తారు పబ్లిషర్స్. వాళ్ళందరికీ ఘోస్ట్‌రైటర్స్‌ని పెట్టి నవలలు రాయించి వదలకుండా సరఫరా చేస్తూండాలి."

"ఘోస్ట్‌రైటర్స్ ఎవరు?"

"హైదరాబాద్‌లో చాలామంది ఉన్నారు– పేజీకి అర్థరూపాయి ఇస్తే– ఇంగ్లీష్ నవలలన్నీ అనువాదం చేసి ఇచ్చేస్తూంటారు వాళ్ళు – సరే– మీరెలాగూ ఇంత దూరం వచ్చారు కాబట్టి ఈ సందు చివర్లో 'జగజ్జెట్టీ పబ్లిషర్స్' అని ఒకతను ఉన్నాడు. అతని దగ్గరకెళ్ళి ఓసారి ప్రయత్నించి చూడండి. మొన్నే అయిదోక్లాస్ చదూతున్న వాళ్ళమ్మాయితో ఓ నవల రాయించి రెండువేల కాపీలు అమ్మేశాడు."

అందరం అదిరిపడ్డాం.

"అయిదో క్లాస్ చదివే అమ్మాయితోనా?"

"అంతా వట్టిది. ఆ అమ్మాయి నిజానికి నాలుగోక్లాసే చదువుతోందిట! మాతో అయిదోక్లాసని అబద్ధం చెప్పాడు"

"అయినా రెండువేల కాపీలు అమ్ముడయాయా?"

"అదీ యాభయ్ రూపాయలు ధరతో?"

"ఓ గాడ్ యాభయ్ రూపాయలే?"

"అవును!"

"అంటే నాకింత అనుభవం ఉంది కాబట్టి నావి కనీసం అయిదు వేలు అమ్ముడవుతాయ్ కదూ" ఆనందంగా అడిగాడు చంద్రకాంత్.

"అవవ్! ఎవరివయినా ఎలాంటి చెత్తయినా, రెండువేల కాపీలే అమ్ముతాడు."

"ఎవరు కొంటారు?"

"మన గవర్నమెంట్!"

"గవర్నమెంట్ నవలలు కొంటుందా?" నమ్మలేనట్లు అడిగాడు శాయిరామ్.

"అవునయ్యా! జిల్లా గ్రంథాలయ సంస్థలద్వారా కొనిపిస్తుంది."

'అయితే! ఆ పబ్లిషర్ దగ్గరకే వెళ్దాం!" అన్నాడు రంగారెడ్డి ఉత్సాహంగా. గోపాల్రావ్ మీసాలవ్యక్తికి ధన్యవాదాలు చెప్పాక అందరం జగజ్జెట్టీ పబ్లిషర్ ఆఫీస్‌కి చేరుకున్నాం. ఒకేసారి కేవలం ఇద్దరు వ్యక్తులే నిలబడటానికి సరిపోయేంత రూమది. రూమ్‌లోనే దొంతర్లు దొంతర్లుగా పాకెట్లు పేర్చి ఉన్నాయి.

వాటి మీద అనేక జిల్లా గ్రంథాలయ సంస్థల అడ్రస్‌లు రాసి ఉన్నాయ్. మిగతా పాకెట్ల మీద ఇంకుతో అడ్రస్‌లు రాస్తోన్న ఓ సన్నటి వ్యక్తి మమ్మల్ని చూడగానే చిరునవ్వు నవ్వాడు.

"నవలలేమయినా అమ్మకానికి ఉన్నాయా?" ఆప్యాయంగా అడిగాడతను.

"అవును! ఇరవై ఉన్నాయ్" అన్నాడు చంద్రకాంత్ ఆత్రుతగా.

"ఒకో నవలా ఎంత బరువుంటుంది?" అడిగాడతను మళ్ళీ.

మాకు అతని ప్రశ్న అర్థం కాలేదు.

"బరువేమిటి?" అయోమయంగా అడిగాడు.

"తెలీదన్నమాట! ఫర్లేదు. ఆ వెయింగ్ మిషన్‌లో వేయండి. ఒక్కొక్క నవల మూడికిలోల బరువుండాలి. వుంటేగానీ మనకు గిట్టుబాటు కాదు. గవర్నమెంట్‌తో వ్యవహారం కదా! మూడు కిలోలుంటేగానీ వప్పుకోరు. ఒకోపుస్తకం నలభై రూపాయలు కనీసం ధర ఉండాలి."

"నలభై రూపాయలే?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

"తప్పదు. నలభై ఉంటేనేగాని వాటాలకు తెగదు–"

"వాటాలేమిటి?"

అతను మావేపు చిరాగ్గా చూశాడు.

"వాటాలంటే తెలీనివాడిని నువ్వేం రచయితవయ్యా! పుస్తకం నలభై రూపాయలుంటే శెక్రటరీలకు మనం పదహార్రూపాయలకే ఇచ్చేస్తాం! అర్థమయిందా?"

"ఎలా ఇస్తాం?"

"చేత్తో ఇస్తాం– లేకపోతే ఏమిటయ్యా? జిల్లా గ్రంథాలయ సంస్థల్లో పాపం మళ్ళీ ఎంతమంది పంచుకోవాలి? చైర్మెన్, శెక్రటరీ, ఒకోసారి కొంతమంది మెంబర్లు–నానా గొడవా ఉంది లెండి దీనికి– మీకర్థంకాదు."

"అయిందయింది" అన్నాడు శాయిరామ్.

"ఏమర్థం అయింది!"

"అదే! నలభై పుస్తకం పదహారుకిస్తే– నలభై మైనస్ పదహారు ఈజీకొల్టూ ముప్పయ్ నాలుగు– అంటే ముప్పయ్ నాలుగూ బై వందా ఇంటూ అరవై ఈజీకోల్టూ నూటపాతికా బై అయిదూ ఈజీకోల్టూ–"

"ష్! ఆపు అరిచాడతను.

మా కందరికీ అర్థమయిపోయింది. ఏ రచయిత ఏ చెత్త రాసినా లంచాలకు ఆశపడి లైబ్రరీవాళ్ళు పుస్తకాలు కొనటం వల్లే సాహిత్యం యింత దారుణంగా తయారవుతోందని–

ఎలాగూ అది దిగజారిపోయింది. మా చంద్రకాంత్ రచయిత అయి దానిని ఇంకొంచెం దిగజారుస్తే మాత్రమేం అనిపించింది.

నేను ఆ పక్కనే ఉన్న తూకం మీద ఒక్కొక్క నవల తూచి చూశాను.

"వీటిల్లో రెండే నవలలు మూడు కిలోల బరువున్నాయండీ! ఒకటి మాత్రం కిలోన్నర ఉంది" అతనితో చెప్పాను.

"అది పనికిరాదు. దాన్ని అవతలపారేసి మిగతా రెండూ ఇటివ్వండి–" రెండూ అతనికిచ్చాన్నేను.

"మరి మిగతా నవలలేవీ? మొత్తం ఇరవై ఉన్నాయన్నారుగా!" అడిగాడతను.

"అవన్నీ ఓ పదిరోజుల్లో రాసిచ్చేస్తానండీ!" అన్నాడు చంద్రకాంత్. "ఖచ్చితంగా పది రోజుల్లో తెచ్చిచ్చిస్తేనే ప్రింట్ చేస్తాను. ఎందుకంటే ఈ నెలాఖరుకల్లా లైబ్రరీలకు వేసెయ్యాలి. లేపోతే ఇంకో పబ్లిషర్ నవలు కొనేస్తారు లైబ్రరీవాళ్ళు. గవర్నమెంట్ సంగతి మీకు తెలీందేముంది? ఎదురుగ్గా ఎవరుంటే వాళ్ళదే పండగ–"

"అవునవును?" అన్నాడు రంగారెడ్డి.

"ఇకపోతే ఒకో నవలకూ రెండొందలిస్తాను. ఇష్టమేనా?"

"అదేమిటండీ? మరీ రెండొందలా! కనీసం అయిదు వందలయినా లేపోతే ఎలా?" అడిగాడు జనార్ధన్.

"ఏమిటీ? అయిదొందలా? మీకేమయినా మతిపోయిందేమిటయ్యా? మీరేమయినా హొటల్ సర్వర్లా? అయిదువందలివ్వడానికి? లేకపోతే వార పత్రికల్లో ఎడిటర్లను

కున్నారా? వందరూపాయలిస్తే అరడజను నవలలు రాసిచ్చేవాళ్ళున్నారు. తెలుసా?" కోపంగా అడిగాడతను.

అప్పుడే చిరిగిపోయిన బట్టలతో బాగా మురికికొట్టుకుపోయి బిచ్చగాడులా ఉన్న ఓ వ్యక్తి గోనెసంచితో లోపలికొచ్చి ఆరు నవలలు కుమ్మరించాడు మాముందు.

"రాసుకొచ్చాన్సార్! వంద రూపాయలివ్వండి" అన్నాడు ఆత్రుతగా.

పబ్లిషర్ ఆ నవలన్నిటినీ తూకంతో తూచాడు. అన్నీ మూడు కిలోల పైచిలుకే ఉన్నాయ్.

వెంటనే ఓ వందనోటు తీసి ఆ వ్యక్తి కిచ్చాడు. అతను సంతోషంగా వెళ్ళిపోయాడు.

"చూసారా! నవలలు దొరక్కకాదు. మీకు రెండొందలివ్వటం! ఈ నెలాఖరు లోపల ఎన్ని నవలు వీలయితే అన్ని నవలలు గవర్నమెంట్ లైబ్రరీలకు అమ్మేయాలి. మళ్ళీ సంవత్సరం దాకా ఫండ్స్ ఉండవ్! అందుకే నాకు మార్జిన్ తక్కువయినా ఫర్లేదని మీకు రెండొందలివ్వటానికి వప్పుకుంటున్నాను- అర్థమయిందా?"

'అయింది!"

"అయితే- ఇదుగో ఈ వెయ్యి రూపాయలూ తీసుకోండి! ఇది ఇరవై నవలలకు ఎడ్వాన్స్!" చంద్రకాంత్ మారు మాట్లాడకుండా వణుకుతోన్న చేతుల్తో నోట్లు అందుకున్నాడు.

"ఇదుగో! మరీ పదిరోజులెందుకు? ఓ వారంలో మిగతావి రాసిచ్చేయలేరూ? మీ కాలనీలో అందరూ తలోచేయీవేస్తే నాలుగు రోజుల్లో అయిపోతాయ్. మీ ఫ్రెండ్స్ చాలామంది ఉంటారు కదా!"

మేము ఆశ్చర్యంతో మొఖాలు చూసుకున్నాం!

"అదేమిటి? మేమందరం ఎలా రాస్తాం? మాకు సరిగ్గా రాయటం రాదు కదా!" అన్నాడు రంగారెడ్డి. అతను చేతిలోని స్కెచ్‌పెన్ కింద పడేసి తనూ కిందపడి ఘొల్లున నవ్వాడు రెండు నిమిషాలపాటు.

"నీయమ్మ! భలే విచిత్రం మనుషుల్లాగున్నారు మీరంతా! గవర్నమెంట్ లైబ్రరీలకు సప్లై చేసే నవలలయ్యా అని చెప్తూంటే మళ్ళీ రాయటం సరిగ్గా రాదుకదా అంటారేమిటి? మీకు తెలుసో తెలీదో - కిందటేడు ఏం జరిగిందనుకున్నారు? ఇలాగే అర్జంటుగా లైబ్రరీలకు పాతిక నవలలు సప్లై చేయాల్సి వచ్చింది. రెండే రెండు రోజుల టైమ్. మతిచెడిపోయిందనుకోండి! ఏం చేయడానికి తోచక రాత్రి రెండింటికి 'టీ' తాగడానికి విజయవాడ రైల్వేస్టేషన్‌కెళ్ళాను. సరిగ్గా అప్పుడే పాతికమంది కన్నడ యువకులు పర్స్‌లు పోగొట్టుకొని టికెట్ కలెక్టర్ బెజవాడలో దించేసేసరికి రోడ్‌మీద కొచ్చి కనబడ్డ వారందరినీ సహాయం చేయమని అడగటం మొదలుపెట్టారు. నేను వాళ్ళందరినీ పట్టుకెళ్ళి ఆ రెండు రోజులూ

భోజనం పెట్టి తలో కన్నడ నవలా రాయించేసి బస్‌టికెట్స్ కొనిచ్చి కర్నాటకకు పంపించేశాను. ఆ నవలన్నీ మన లైబ్రరీలకు అమ్మేశాను-"

"కన్నడ నవలలు మన లైబ్రరీలకెలా అమ్మారు?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

"కన్నడ నవలలని ఎవడికి తెలుసు! వాటి కవర్ మీద తెలుగు నవలలనే రాశాం కదా! అదీగాక కన్నడా- తెలుగూ- కొంచెం దగ్గర దగ్గరగా ఉంటాయ్ కదా! పైగా అది కర్నాటక బోర్డర్స్‌లో ఉన్న తెలుగు రచయితలు రాశారని ముందు మాటలో రాసేశాను- ఎలావుంది మన ప్లాను?" గర్వంగా అడిగాడతను.

"అద్భుతం" అన్నాడు చంద్రకాంత్.

"మరి ఆ నవలలు చదివిన వారెవరూ అవి తెలుగు నవలలు కావని కంప్లెయింట్ చేయలేదా?" అనుమానంగా అడిగాడు శాయిరామ్.

అతను శాయిరామ్ వేపు చిరునవ్వుతో చూశాడు.

"ఒకే ఒక్కడు చేశాడ్లే! హైస్కూలులో తెలుగు పండిట్ అంటవాడు. ఆ నవలలో ఉన్నది తెలుగుకాదు, కన్నడభాష అంటూ ఎడ్యుకేషన్ మినిష్టర్ దగ్గర్నుంచీ అడ్డమయినోడికి మహజర్లు పెట్టాడు. ఇంక లాభం లేదని నేనే స్వయంగా వాడింటికెళ్ళి 'అది తెలుగే" అని మర్యాదగా చెప్పాను. కాదన్నాడు. 'తెలుగేరా దేవుడా! వప్పుకో"అని బ్రతిమాలాను. ససేమిరా కాదన్నాడు. అప్పుడు బయట నిలబెట్టిన గూండాల్ని లోపలికి రమ్మని సైగచేశాను. పాపం! ఒక కాలు విరగ్గానే దారికొచ్చేశాడు.

అప్పటికప్పుడే తనకు తెలుగు సరిగ్గా రాకపోవటం వల్ల ఆ నవలల గురించి తప్పుడు మహజర్లు పంపాననీ, అంచేత వాటిని ఉపసంహరించుకుంటున్నాననీ ఉత్తరాలు రాసి సంతకాలు చేశాడు. చూడండి! ఎంత కిరాతకుడో-"

"అవును! పరమ కిరాతకుడు!" అన్నాడు రంగారెడ్డి.

"కన్నడ భాష అయితే వాడికెందుకు? మరాఠీ భాష అయితే వాడికెందుకు? ఆ భాషవస్తే ఆ పుస్తకాలు చదువుకోవాలి. లేకపోతే సైలెంట్‌గా ఉండాలి అంతేకానీ పిటిషన్లు పెడతాడా?" అన్నాడు గోపాల్రావ్.

పబ్లిషర్ మొఖం ఆనందంతో విప్పారింది.

అప్పటికప్పుడే ఫోన్‌చేసి కూల్‌డ్రింక్స్ తెప్పించి మా అందరికి ఇచ్చాడు.

"మీరు మర్యాదస్తులు కాబట్టి అర్థం చేసుకుని మాట్లాడుతున్నారు. ఇదే ఈ గవర్నమెంట్ లైబ్రరీలలో ఫ్రీగా పుస్తకాలు చదివే వారున్నారే! ఎంత నమ్మకద్రోహులో మీకు తెలీదు. ఎప్పుడు ఎవడిమీద ఏం రాద్దామా అనే ఇరవై నాలుగ్గంటలూ ఆలోచన. మొన్నటికి మొన్న ఇంకో డెవడో పిసినారి వెధవ నేను వేసిన నవల్లన్నిటిలోనూ పేజీకి అరులైన్లే

వున్నాయనీ, ఇలా యాభై పేజీలు పుస్తకాన్ని మూడొందలు పేజీలలో సర్దటం అక్రమమనీ అందరికి రాసిపారేశాడు. ఆ దగుల్బాజీ వల్ల పెద్ద గొడవయిపోయి చివరకు ఆ పేరుతో ఉన్న పబ్లికేషన్స్ మూసిపారేసి, ఇంకో పేరుతో ఈ పబ్లికేషన్స్ పెట్టాను మళ్ళీ. అయితే ఆ ఉత్తరాల్రాసిన వాడిని వదల్లేదనుకోండి. ఒక చేత్తోనే ఆఫీస్ పని చేసుకుంటున్నాడిప్పుడు–"

"రెండోచెయ్యి కూడా తీసెయ్యాల్సింది దొంగవెధవకు" అన్నాడు శాయిరామ్.

"తీద్దామనే అనుకున్నాగానీ– మళ్ళీ జాలివేసింది."

అందరూ అతని దగ్గర శెలవ్ తీసుకుని బయటకొచ్చాం.

"డబ్బు తక్కువే అయినా ఈ దెబ్బతో నువ్ రచయితగా తెలుగు దేశమంతా పాప్యులర్ అయిపోతావ్!" అన్నాడు రంగారెడ్డి చంద్రకాంత్‌ని ఈర్ష్యగా చూస్తూ.

"వాటిల్లో ఒకటి రెండు నవలలు సినిమాలుగా తీస్తేచాలు! డబ్బు కూడా లెఖ్ఖ వుండదు.." అన్నాడు శాయిరామ్.

"ఎవరూ తీయకపోయినా మనకాలనీ తరపున మనమే తీయవచ్చు– హీరోగా నేను ఫ్రీగా యాక్షన్ చేస్తాను కాబట్టి ఎక్కువ ఖర్చుకూడా అవదు" అన్నాడు జనార్థన్. ఆ మాట వింటూనే అందరూ జనార్ధన్ వేపు భయంగా చూశారు.

నాలుగడుగులు వేశామో లేదో ఎదురుగ్గా ఆరుగుమీద నిలబడ్డ ఓ వ్యక్తి మావంక చూసి "మాష్టారూ! రండి! ఇటు రండోసారి!" అంటూ చేయి ఊపసాగాడు.

అయోమయంగా అందరం అతని దగ్గరకు నడిచాం.

"ఎంతిస్తానంటున్నాడు?" అడిగాడతను.

"ఏమిటి– ఎంత ఇస్తున్నాడు?"

"అదే! నవలకెంతిస్తానంటున్నాడా జగజ్జెట్టి?"

"ఓ పబ్లిషర్ సంగతా! నవలకు రెండొందలు–"

"చూశారా మిమ్మల్నెట్టా ఫూల్ చేసేసాడో!"

అందరం ఉలిక్కిపడ్డాం.

"ఫూల్ చేసేశాడా?"

"అవును! నేను ఒకో నవలకూ ఆరొందలిస్తున్నాను."

చంద్రకాంత్ మొఖం పాలిపోయింది. మా అందరికీ మోసానికి గురికాబడిన ఫీలింగ్స్ శరీరమంతా గొంగళి పురుగుల్లా పాకేస్తున్నాయ్.

"నిజంగా మీరు ఆరొందలిస్తున్నారా?" అడిగాన్నేను.

"అవునయ్యా! తెలుగు మీడియంలోనే చెప్తున్నాను కదా–"

నేను రంగారెడ్డి వేపు చూశాను.

"అయితే మనం వెనక్కు వెళ్ళి వాడి డబ్బు వాడికిచ్చేసి మన నవలలు మనం పట్టుకొచ్చేద్దాం–" అన్నాడు శాయీరామ్ ఆవేశంగా.

"అవును! పదండి" అన్నాడు యాదగిరి.

అందరం కోపంగా మళ్ళీ జెగజ్జెట్టీ పబ్లిషర్స్ ఆఫీసులోకి నడిచాం. ఆ వ్యక్తి మమ్మల్ని చూసి చిరునవ్వు నవ్వాడు.

"నవలలేమయినా అమ్మకానికి ఉన్నాయా?" అప్యాయంగా అడిగాడు "ఒకో నవలా ఎంత బరువుంటుంది?"

మాకు వళ్ళు మండిపోయింది.

అయిదు నిమిషాల్లోనే అతను మమ్మల్ని మర్చిపోవటం చూస్తే అది నిజమా, నటనా అనే అనుమానం మొదలయింది.

"మేము ఇంతకు ముందేగా వచ్చి వెళ్ళింది? అప్పుడే మర్చిపోయారా?" ఆశ్చర్యంగా అడిగాడు చంద్రకాంత్.

"ఓ! మీరా! సారీ! రండి! నవలలు రాసుకొచ్చేశారా?" ఆత్రుతగా అడిగాడతను.

మాకు మతిపోతోంది అతని ప్రశ్నలకు.

"పదినిమిషాల్లో ఎలా రాస్తామండీ?" చిరాగ్గా అన్నాడు శాయీరామ్.

"అందరూ తలోచెయ్యీవేస్తే ఎంతలోకిసార్! కిందటేడు నేనలాగే రాయించాను– రామవరప్పాడు నుంచి ఎనిమిది మంది ఆడ వ్యవసాయకూలీలను తీసుకొచ్చి రాత్రికి రాత్రి ఆరు నవలలు రాయించేశాను. కాంపిటీషన్ సార్! అంత ఫాస్ట్‌గా బిజినెస్ చేయకపోతే దెబ్బతినేస్తాం. అసలే గవర్నమెంట్‌తో వ్యవహారం– గవర్నమెంట్ వాళ్ళ వ్యవహారం మీకు తెలీందేముంది? ఎదురుగ్గా ఎవడు పచ్చగా కనబడితే వాడిదే రాజ్యం– ఇంతకూ మళ్ళీ ఎందుకొచ్చారు మీరు?"

"మేము మా నవలలు మీకిచ్చే అభిప్రాయం మార్చుకున్నామని చెప్పటానికొచ్చాం–" అన్నాడు రంగారెడ్డి.

అతను ఆశ్చర్యపోయాడు.

"అదేమిటి? ఎందుకని అలా?"

"లేకపోతే ఏమిటయ్యా? పెద్దమనిషివి గదాని నీ దగ్గరకొస్తే మమ్మల్ని మోసం చేస్తావా?"

అతను మరింత ఆశ్చర్యపోయాడు.

"నేను మోసం చేశానా మిమ్మల్ని?"

"అవ్! వేరే పబ్లిషర్స్ నవలకు ఆరొందలిస్తున్రంట– నువ్ రెండొందలే ఇయ్యబోతివి–

నీయవ్వ– ఇది మోసంగాదువయ్యా?” మండిపడుతూ అడిగాడు యాదగిరి.

“ఓహెూ! అయితే ఇది తప్పకుండా ఆ నవలాంతకరావ్ పనయి ఉంటుంది. సరే వాడి మాటలే మీకు రుచి అయితే మీ నవలలు తీసుకుపోండి! నా వెయ్యి రూపాయిలూ నాకిచ్చేయండి.”

దొరికిందే ఛాన్సని అతని డబ్బు అతనికిచ్చేసి నవలలు తీసేసుకున్నాం.

బయటకు నడుస్తూంటే వెనుకనుంచీ నవలాంతకరావ్‌ని తిట్టడం వినిపిస్తోంది.

“నా కొడుకు– నా బేరాలన్నీ చెడగొడుతున్నాడు, ఇదిగో ఇంకోసారి ఆలోచించుకుని మీ నవలలు పట్టుకెళ్ళండి. మళ్ళీ తిరిగి వచ్చారంటే ఈసారి నవలకు వందే ఇస్తా.”

మేము తిన్నగా నవలాంతకరావ్ ఇంటికెళ్ళాం.

అప్పుడు ఇంట్లోని నవలలన్నీ ఒక పెద్ద ప్రైవేట్ రిక్షాలోకి చేరుస్తున్నాడతను.

“ఏ నవలయినా ఆర్రూపాలే” అని రాసివుంది వాటిమీద.

“నవలలన్నీ తెచ్చేశామండీ” అతనితో ఆనందంగా చెప్పాడు శాయీరామ్.

“మంచి పని చేశారు. లేకపోతే ఎంత నష్టపోయే వాళ్లో చూడండి–”

“చాలా నష్టపోయేవాళ్ళమండి–”

“నన్నడిగితే– గంగోత్రీ పబ్లికేషన్స్‌లో మీకు మంచి రేటు దొరుకుతుంది! కృష్ణ ఒడ్డునే ఉంటుంది వాళ్ళాఫీస్. అక్కడికెళ్ళండి–”

“అదేమిటండీ– మీరు తీసుకోరా?”

“నవలల పబ్లికేషన్ మానేశాను కదా! ప్రస్తుతం గవర్నమెంట్ లైబ్రరీలకు నవలలు అంటగట్టే బిజినెస్‌కి బ్రోకర్‌గా పనిచేస్తున్నాను–”

“మరి ఇందాక మాతో అలా ఎందుకన్నారు?”

“నేనయితే ఆరొందలిచ్చేవాడినీ అన్నానుగానీ ఇప్పుడు ఇస్తానని చెప్పలేదుగా–”

గోపాల్రావ్‌కి కోపం ఆగలేదు. ఛటుక్కున అతని చొక్కా పట్టుకున్నాడు.

“రాస్కెల్ మమ్మల్ని మోసం చేస్తావా?”

అతను బిగ్గరగా అరవటం మొదలుపెట్టేసరికి ఆ వీధిలో వాళ్ళందరూ పరుగుతో వచ్చేశారు. అరగంట పట్టింది మాకు అక్కడినుంచి బయటపడటానికి.

నాలుగడుగులు వేశామోలేదో ఓ వ్యక్తి పరుగుతో వచ్చాడు మా దగ్గరకు.

“నవల్లేమయినా ఉన్నాయాసార్! గవర్నమెంట్ లైబ్రరీస్ బ్రోకర్‌ని సార్! ఫస్ట్‌క్లాస్ బిజినెస్ చేయిస్తాను. ఎంత చెత్త నవలయినాసరే– రెండువేల కాపీలు అంటగట్టేయవచ్చు. –”

“మరి నీ కమిషన్ ఎంత?”

“చాలా మార్జినల్ సార్! హైదరాబాద్‌లోనూ, జిల్లాలోనూ అన్నీ పోను నాకు టెన్

పర్సెంట్ – చూస్కోండి ఎంత లాభమో మీకు–" ఉత్సాహంగా అన్నాడతను.

మేము అతనిని వదిలించుకుని ముందుకి నడవసాగాం.

"సార్! మీ బుక్స్ నాకివ్వండి. ప్రస్తుతం దసరా రిబేట్ కూడా అయిదుశాతం ఇస్తున్నాను."

అతి కష్టం మీద అందరం అతనిని తప్పించుకుని కృష్ణ ఒడ్డుకి బయలుదేరాం. గంగోత్రీ పబ్లికేషన్స్ అన్న పెద్దబోర్డు వేలాడుతోంది ఓ పాడుబడ్డ భవనం ముందు.

అందరం లోపలకు నడిచాం. బాగా బూజుపట్టి ఉన్న ఓ పెద్ద విశాలమయిన గదిలో కూర్చుని వ్రాతప్రతులు కొన్ని తిరగేస్తూ కనిపించాడు దాని డైరెక్టర్.

లోపలకు వెళ్ళి మమ్మల్ని మేము పరిచయం చేసుకున్నాం. చంద్రకాంత్ రచయిత అనగానే అతని కళ్ళల్లో ఆనందం వెలిగిపోయింది.

"అబ్బ! మీకోసం ఎంతకాలం నుంచీ ఎదురుచూస్తున్నాను– ఒక్క నిమిషం కూర్చోండి" అంటూ పరుగుతోవెళ్ళి తలుపులు మూసి బోల్ట్ చేసేశాడతను. ఆ డోర్ పక్కనే ఉన్న పొడుగాటి ఇనుప చువ్వ తీసుకుని పరుగుతో మావేపు రాసాగాడు. మాకు వణుకు పుట్టుకొచ్చింది. లేచి మరో మూలకు పరుగెత్తటానికి సిద్ధంగా నిలబడ్డాం.

అతను ఇనుప చువ్వ పైకెత్తగానే మేము తలో మూలకూ చెల్లా చెదురయి పరుగెత్తాం. అతని కళ్ళల్లోంచి నిప్పులు కురుస్తున్నాయ్.

"దొంగ నాయాల్లారా! మంచి సాహిత్యానికి భ్రష్టుపట్టిస్తారా? అడ్డమయిన సెక్స్ నవల్లూ రాసి మంచి సాహిత్యాన్ని తెలుగు భాషకు దూరం చేస్తారా? మీ వల్ల నేను ఎన్నో సంవత్సరాల నుంచీ ప్రచురిస్తోన్న మంచి సాహిత్యం ఎలా అమ్ముడవకుండా మ్రగ్గిపోతోందో చూడండ్రా! మిమ్మల్నందర్నీ ఇవాళ మర్డర్ చేయందే వదలను–"

అంటూ ఇనుప చువ్వ విసురుతోంటే అందరం గదంతా ఆ చువ్వకు దొరక్కుండా పరుగెత్తసాగాం. అయిదు నిమిషాల తర్వాత యాదగిరి రిస్క్ తీసుకుని తలుపు దగ్గరకు పరుగెత్తి తలుపు తెరచాడు. దాంతో పక్షుల్లా బయటికెగిరి వచ్చేశాం.

చాలాదూరం మా వెనుకే పరుగెత్తి ఇంక పరుగెత్తలేక ఆగిపోయాడతను. ఊళ్ళోకి చేరుకుని ఆయాసంతో ఒగరుస్తూ ఓ హొటల్లో కూలబడి కాఫీ ఆర్డర్ చేశాం. సర్వర్ అప్యాయంగా మా దగ్గరకొచ్చాడు.

"పిచ్చి పబ్లిషర్ దగ్గర్నుంచి తప్పించుకొస్తున్నారా సార్! అడిగాడతను.

"అవును! నీకెలా తెలుసు?"

"సాధారణంగా మా హొటల్ కొచ్చేవాళ్ళంతా అతని దగ్గర్నుంచీ పారిపోయి వచ్చేవాళ్ళే సార్."

"అతనికెందుకని పిచ్చెక్కింది?" అడిగాడు రంగారెడ్డి.

"పాతకాలం పబ్లిషర్సార్. అందుకని మంచి సాహిత్యమంటే అభిమానం- చివరకు ఈ మధ్య బిజినెస్ పడిపోయిందని ఓ ఆధునిక ఫేమస్ రచయిత నవలకొన్నాడు. తీరా పబ్లిష్ చేశాక తెలిసిందేమిటంటే ఆ నవలను ఆ తాగుబోతు రచయిత అప్పటికే అరడజను మంది పబ్లిషర్స్‌కు అమ్మేశాడట- ప్రతీసారీ నవల పేరు మాత్రం మారుస్తున్నాడు. దాంతో ఈయనకు పిచ్చెక్కి కనబడ్డ రచయితనల్లా చంపటానికి ప్రయత్నిస్తున్నాడు-"

"అవునూ! వాడూ, వీడూ ఎందుకు? ఇందాక గోపాల్రావ్ ఫ్రెండ్ చెప్పినట్లు స్కీమ్ నెంబర్ వన్, స్కీమ్ నెంబర్ టూ ల ప్రకారం మనమే మన నవలలు పబ్లిష్ చేసుకుంటే?" అన్నాడు శాయిరామ్.

చంద్రకాంత్ ఓ క్షణం ఆలోచించాడు.

"దినపత్రిక ఎడిటర్లకు లంచం ఇచ్చే బదులు డైరక్ట్‌గా స్కీమ్ నెంబర్ 2లో నవలలు రిలీజ్ జేసి, అమ్మకాల కోసం బ్రోకర్లను పెట్టుకుంటే బాగుంటుంది కదా" అన్నాడతను.

అందరికీ చంద్రకాంత్ అయిడియా నచ్చింది . వెంటనే హైదరాబాద్ తిరుగు మొఖం పట్టాం.

వారం రోజుల అందరం శెలవుపెట్టి మూడు నవలలు ప్రింట్ చేయించేశాం. ఒకో నవల లక్ష ప్రతులు అమ్ముడవుతుందని చంద్రకాంత్ చెప్పినా ఎందుకయినా మంచిదని ఒకోటీ అయిదువేల కాపీలు మాత్రమే వేశాం. అన్ని పత్రికల్లో పబ్లిసిటీ ప్రారంభించాం. ప్రముఖ అజ్ఞాత రచయిత శ్రీ చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్‌గారి ఫలానా నవలలు దీపావళికి విడుదల! కావలసినవారు వెంటనే ఎ.33/6/1, నిర్భయ్‌నగర్ కాలనీ, హైదరాబాద్‌ని సంప్రదించండి. ఆ మర్నాటి నుంచీ పుస్తకాలు కొనేందుకు ఏజెంట్లు, పాఠకులు, రెంటల్ బుక్‌స్టాల్ వాళ్ళు కాలనీలో క్యూలు కడతారని మా అందరికీ నమ్మకం.

ఆ రాత్రి పన్నెండు గంటలకు కాలనీ మధ్యలో నుంచి బిగ్గరగా ఏడుపులు, కొన్ని గొంతులు ఆ ఏడుపు ఓనరుని ఓదార్చటం వినిపించేసరికి నేను తలుపు తెరుచుకుని బయటకు పరుగెత్తాను కంగారుగా. అప్పటికే కొంతమంది ఆడా మగా పోగయి వున్నారు. మధ్యలో కూర్చుని ప్రింటయిన నవలలు వళ్ళో పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు చంద్రకాంత్.

"ఏమిటి? ఏం జరిగింది?" అడిగాను రంగారెడ్డిని.

"మరేం లేదు, తన నవలను పుస్తక రూపంలో చూసుకునేసరికి కొంచెం మతి చలించినట్లుంది" అన్నాడు జాలిగా.

అందరం అతనని ఓదార్చసాగాం.

"నా తల్లులూ, తండ్రులూ అందరూ మీరే! పూర్వజన్మ సుకృతం వలనే నేనీ కాలనీలో కొచ్చాను. లేకపోతే జీవితమంతా అజ్ఞాత రచయితగానే మిగిలిపోయేవాడిని" ఏడుపు ఆపి మధ్యమధ్యలో మాట్లాడుతున్నాడతను.

"అయిందేదో అయిపోయిందకదా! ఇంక ఊరుకో" అన్నాడు శాయిరామ్.

"మీకు తెలీదుసార్! నైన్త్‌క్లాస్ చదివేప్పుడు నాకు కల వచ్చింది. నేనూకూడా షేక్స్పియర్ అంత గొప్ప రచయిత అయిపోయినట్లూ, నా పుస్తకాలన్నీ కూడా కాలేజీ విద్యార్థులకు టెక్స్ట్ పుస్తకాలుగా పెట్టినట్లూ– ఇన్నాళ్ళకు నా కలలో కొంత భాగాన్ని మీరు నిజం చేశారు–"

అతనిని ఓదార్చి వాళ్ళింటికి పంపించేసరికి రెండయిపోయింది.

ఆ తరువాత ఇంకమాకు నిద్రపట్టలేదు.

ఉదయం జరగాల్సిన బుక్‌రిలీజ్ ఫంక్షన్‌కి ఏర్పాట్లు ప్రారంభించాం. మామూలుగానే శాయిరామ్ మైక్ ఎరేంజ్‌మెంట్స్ చూస్తున్నాడు.

ఫంక్షన్ తర్వాత జనమంతా 'క్యూ' లో నిలబడి చంద్రకాంత్ పుస్తకాలు కొనుక్కోడానికి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశాడు చంద్రకాంత్. క్యూలో నిలబడ్డవాళ్ళకు దాహమేస్తే మంచి నీళ్ళు ఇవ్వటానికి పార్వతీదేవి ఓ చలివేంద్రం కూడా ప్రారంభించింది.

తెల్లారిపోయింది.

తొమ్మిది గంటలకల్లా జనం రావటం మొదలయింది. బుక్ రిలీజ్ ఫంక్షన్‌కి ఇంతమంది జనం ఎలా వచ్చారా– అని అందరం ఆశ్చర్యపోతున్నాం. ఎందుకంటే అది కేవలం ఫార్మాలిటీ కోసం మా కాలనీ వాళ్ళు పదిమందీ కలసి చేయవలసిన కార్యక్రమం. ఆ పుస్తకాల్ని జనార్ధన్ రిలీజ్ చేస్తానని బ్రతిమాలుతే సరేనని వప్పుకున్నాం. రాను రాను జనం మరీ ఎక్కువయి పోయారు. ముఖ్యంగా యువకులు, విద్యార్థులు, విద్యార్థినులు ఎక్కువ సంఖ్యలో వచ్చేశారు. ఆ జనాన్ని చూసి చంద్రకాంత్ మళ్లీ ఏడవటం ప్రారంభించారు. నాకూ రంగారెడ్డికి వళ్ళు మండిపోయింది.

"మళ్ళీ ఏమొచ్చింది? ఎందుకేడుస్తున్నావ్" అడిగాడు రంగారెడ్డి.

"నా పుస్తకాన్ని ఇంతమంది యువకులు అభిమానిస్తున్నారంటే– తెలుగు ప్రజలకు రచయితల మీద ఎంత ప్రేమ ఉందో, మన రచయితలను ఎంత గౌరవిస్తున్నారో తెలుస్తోంది. ఇంత గొప్ప అభిమానాన్ని నేను భరించలేను" అంటూ మళ్ళీ ఏడవసాగాడు.

ఫంక్షన్ మొదలయింది. జనార్ధన్ పుస్తకాలు రిలీజ్ చేయగానే జనంలోనుంచి కలకలం బయలుదేరింది.

"ఏడీ– చిరంజీవి కావాలి. చిరంజీవి ఎక్కడా?" అంటూ ఆరుస్తున్నారు కొంతమంది.

మాకేమీ అర్థం కాలేదు.

"ఏ చిరంజీవి కావాలి మీకు?" వేదిక మీద నించే అడిగాడు రంగారెడ్డి.

"హీరో చిరంజీవి కావాలి కావాలీ-"

"అరే సాలే! సినిమా హీరో చిరంజీవికో బులారే-" ఎవడో తిట్టాడు.

రంగారెడ్డికి కోపం వచ్చేసింది ఆ తిట్టుతో.

"అరే తుమ్‌సాలే- తేరా బాప్‌సాలే- తేరీ బహిన్‌సాలే-" అంటూ అయిదు నిమిషాలు హిందీలో మాట్లాడాక అతను తగ్గాడు. ఈలోగా జనంలోనుంచి యాదగిరి దూసుకొచ్చేశాడు.

"చూసిన్రా! ఈ కిరికిరంతా ఎందుకయిన్దానుకున్రు! మనోళ్లెకు తెల్వకుండ మన జనార్ధన్ అన్నపోయి ఊరంతా స్పీకర్ ప్రకటనలు గుప్పించేశాడు. ఎక్కడ చూచినా పెద్ద ఎత్తున వాల్ పోస్టర్స్! ప్రముఖ రచయిత చంద్రకాంత్ రచించిన నవలలు యువకులు ఆరాధ్య దైవం, ప్రముఖ సినీ నటుడుచే ఆవిష్కారం-" అని రాశాడందులో అందుకని అందరూ చిరంజీవే వస్తున్నాడనుకున్నారు-"

అప్పుడర్థమయింది మాకు. జనమందరినీ బ్రతిమాలి మా ఉద్దేశ్యం యువకుల హీరో అంటే జనార్ధనేనని సర్ది చెప్పేసరికి తల ప్రాణం తోక కొచ్చింది. జనార్ధన్ మీద కొంతమంది టమోటాలు, రాళ్ళు విసిరాక ఎవర్దారిన వాళ్లు వెళ్ళిపోయారు.

వాళ్ళెవరయినా అడిగితే పుస్తకాలు అమ్మేద్దామని కూచున్న చంద్రకాంత్, పార్వతీదేవి సాయంత్రం వరకూ ఎదురుచూసి చూసి విసిగిపోయారు.

ఆ తరువాత వారం రోజులు కూడా గడిచిపోయినయిగాని ఒక్క పుస్తకం కూడా అమ్ముడు పోలేదు.

విజయవాడ నుంచి చంద్రకాంత్ పుస్తకాలు కావాలని ఓ వందమంది బుక్‌షాప్స్ వాళ్ళు అర్డర్స్ ఇచ్చారుగానీ వాళ్ళకు అరవైశాతం కమిషన్ ఇవ్వాలనీ, ఆ డబ్బుకూడా మరో సంవత్సరం తర్వాత ఇస్తామనీ- రాశారు.

అందరం ఎటూ తోచక తలపట్టుక్కూచున్నాం.

"ఇక లాభంలేదు. ఇంక వీలయినన్ని కాపీలు డిస్ట్రిక్కు లైబ్రెరీస్‌కి తోశేద్దాం" అన్నాడు శాయిరామ్.

"అవును- అదేమంచిది" అన్నాడు రంగారెడ్డి.

వెంటనే అందరం ఆ కార్యక్రమంలోకి దిగిపోయాం.

"ముందు మన పుస్తకాలు ఎప్రూవుడ్ లిస్ట్‌లోకి రావాలి. ఆ లిస్ట్‌లో ఉన్న పుస్తకాలే జిల్లా గ్రంథాయాలు కొంటాయ్" చెప్పాడు గోపాల్రావ్.

"మరి ఆ లిస్ట్‌లో మన పుస్తకాలు రావాలంటే ఎంత పర్సెంటేజ్ ఇవ్వాలి" అడిగాడు

చంద్రకాంత్.

"ఎంతో లేదులెండి– కొంచమే! వీళ్ళు చాలా మంచాళ్ళు! బేరమాడేరకం కాదు" అన్నాడు గోపాల్రావ్.

"అయితే కానిచ్చేద్దాం! ఇక ఆలస్యం ఎందుకు?" అన్నాడు రంగారెడ్డి.

రెండు రోజుల్లో లిస్ట్‌లో చంద్రకాంత్ నవలల పేర్లు వచ్చేశాయి. వెంటనే ఆ లిస్ట్‌లు తీసుకుని జిల్లాల పర్యటన ప్రారంభించాం. లైబ్రరీ సెక్రటరీలను, కమిటీ మెంబర్స్‌నీ, ఛైర్మెన్‌నీ అందరినీ కలుసుకుని పర్సెంటేజ్‌లు చాలా వేగంగా ఫిక్స్ చేసేస్తూ పుస్తకాల సప్లయికి అర్డర్స్ తీసుకోసాగాం.

పది రోజుల్లో అంతా సెటిలయిపోయింది. రెండువేల కాపీలు అమ్మకాలు జరిగి పోయాయి ఓరల్‌గా.

అందరం ఆ శుభ సంధర్భాన్ని పురస్కరించుకుని కాలనీలో బీర్‌పార్టీ కూడా ఏర్పాటు చేసుకున్నాం. ఆ మర్నాడు వచ్చింది జీవో.

తెలుగుదేశం ప్రభుత్వం లైబ్రరీల్లో పుస్తకాలు కొనటాన్ని సిషేధించింది. చంద్రకాంత్ మొఖం పాలిపోయింది. ఉండుంది పిచ్చిమాటలు మాట్లాడటం మొదలుపెట్టాడు. అతనికి పిచ్చి ఎక్కిందేమోనన్న అనుమానం కూడా కలిగింది మాకు.

కొద్ది రోజులపాటు మాకు మనసు మనసులోలేదు. కాలనీ ఫండ్స్ అన్నీ పుస్తకాల ప్రింటింగ్‌కి ఉపయోగించేశాం. ఏ క్షణాన్నయినా మా మెంబర్స్ ఏదయినా ఫంక్షన్ ఆర్గనైజ్ చేయమని కోరితే ఏం చేయాలో తెలీని ఆయోమయస్థితిలో పడిపోయాం.

ఓ రోజు మళ్లీ అర్థరాత్రి ఏడుపు వినిపించేసరికి అందరం బయటకు పరుగెత్తాం.

చంద్రకాంత్ మామూలుగానే వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

గోపాల్రావ్ అతనిని ఓదారుస్తున్నాడు.

యాదగిరి ఆనందంగా. ఎగ్జయిట్‌మెంట్‌తో మాట్లాడుతున్నాడు.

"చాలా తేలికన్నా– మాచిన్నాన్న గిట్లనే తన్రాసిన పుస్తకమొకటి శాంక్షన్ చేపించిండు..."

"ఏమిటి శాంక్షన్ చేయించటం?" అయోమయంగా అడిగాను.

"అదే మన చంద్రకాంత్ తంబి బుక్కుని మన హైస్కూల్‌కిగానీ, కాలేజీకిగానీ నాన్‌డిటైల్డ్ టెక్స్ట్‌బుక్స్‌గా వేయడానికి కోషిస్ చేద్దం!"

నాకు నవ్వొచ్చింది..

"నీకేమయినా పిచ్చెక్కిందా? టెక్స్ట్ బుక్స్‌గా రావాలంటే అది రచించిన వారికి చాలా పెద్ద పేరు ప్రఖ్యాతులుండాలి– లేదా ఎకడమిక్ క్వాలిఫికేషన్స్ ఉండాలి–"

"నీయవ్వ– మీకు తెలీదు, ఇంకొకడు జెప్తే ఇనరు– నడవండ్రి నాతో–" అన్నాడతను కోపంగా.

చంద్రకాంత్ లేచి యాదగిరిని కౌగిలించుకుని బావురుమన్నాడు.

"నైన్త్‌క్లాస్‌లోనేను కన్న కల తాలూకూ రెండో భాగం కూడా నిజమయేట్లు చేస్తున్నా వన్నా! నువ్వే నా తల్లివి, తండ్రివీ!"

అతనిని అతి కష్టం మీద వదిలించుకుని బయలుదేరాం.

ముందు యాదగిరి చిన్నాన్న ఇంటికి వెళ్ళాం. సంగతి విని అతనే చెప్పాడు.

"ఇది చాలా చిన్న విషయం బిడ్డా! షేక్‌స్పియర్ ఏమి చెప్పిండో ఎరుకనా?"

"ఏమి చెప్పిండు?"

"బేర్స్ బై గ్లాసెస్

లయన్స్ బై నైట్స్

ఎలిఫెంట్స్ బై పిట్స్

అండ్ మెన్ బై ఫ్లేటర్"

"ఇప్పుడెందుకు జెప్తున్నావ్ మాకు?" చిరాగ్గా అడిగాడు యాదగిరి.

"ఇంకా సమజ్ కాలేదా? పొగడ్తకు లొంగని మనిషి దునియాలలేడు. ఎడ్యుకేషన్ మినిష్టరూ. యూనివర్సిటీ చైర్మెన్‌లు, టెక్ట్స్‌బుక్ కమిటీ మెంబర్ అందర్నీ పొగడండ్రి! రెండోరోజు మీరేం పుస్తకం రాసినాగాని మన కాలేజీ, యూనివర్సిటీల్లో టెక్ట్స్ బుక్‌గా వస్తది."

గోపాల్రావ్ హఠాత్తుగా ఆయన కాళ్ళమీద పడిపోయాడు.

"ఆహా! ఎంత గొప్ప సూత్రం చెప్పారు సార్!" అన్నాడు ఆనందభాష్పాలు రాలుస్తూ.


అందరం ఇంటికి చేరుకున్నాం.

మా చంద్రకాంత్ పుస్తకాలు టెక్ట్స్ బుక్స్‌గా రావటానికి ఎవరెవరి సహాయ సహకారాలు కావాలో లిస్ట్ తయారుచేశాం. వాళ్ళందరికీ సన్మానాలు ఏర్పాటు చేసేయాలని నిర్ణయించుకున్నాం.

ఆ తరువాత మా కెవరికీ క్షణం తీరిక లేకపోయింది.

రెండునెలల్లో పదహారు సన్మానాలు జరిపాం మా కాలనీలో. ఆ సన్మాన వివరాలు అన్ని న్యూస్ పేపర్లలో కవర్ చేయించాం. అలా కవర్ చేసేందుకు ఆ న్యూస్ పేపర్ జర్నలిస్ట్‌లకు ముందే సన్మానం చేసేశాం. చివరకు ఆ శుభ సమయం రానే వచ్చింది.

మా చంద్రకాంత్ రాసిన మూడు నవలలూ డిగ్రీ తెలుగు నాన్‌డీటెయిల్డ్స్‌గా ఎన్నికయిపోయాయ్.




ఆ రాత్రి మళ్ళీ చంద్రకాంత్ ఏడుపు వినిపించింది.

కిటికీ తెరచి చూశాను గానీ అతనొక్కడే కూర్చుని కనిపించాడు.

అందరూ కిటికీలు తెరచి చూస్తున్నారుగానీ ఎవరూ బయట రావటం లేదు.

బహుశా అందరూ నాలాగానే ఆలోచిస్తూండి ఉంటారు.

చంద్రకాంత్ మాకు ఎంత కావలసిన వాడయినా అతను రాసిన చెత్త పుస్తకాల్ని పాఠ్యగ్రంథాలుగా మన తెలుగు పిల్లలు చదవటం ఎందుకో మాకు ఎబ్బెట్టుగా ఉంది. ఎందుకంటే వాటికి ఎలాంటి విలువలూ లేవని మా మనసుల్లో మాకు తెలుసు–

కానీ ఇప్పుడింక చేసేదేముంది?

అంచేత కిటికీ మూసేసి నిద్రలోకి జారిపోయాను–

* * * * *